క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



కంచికచర్ల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుంటూరు జిల్లా తాడేపల్లిలోని జగన్ నివాసం వద్ద ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, కంచికచర్ల ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీ మలక్‌బషీర్ సోదరుడు సలీమ్ కుమారుడి వివాహానికి ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వానం పలికి శుభలేఖను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సయ్యద్ మహ్మద్ (ఎంఎఫ్), పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా సత్యనారాయణ

వత్సవాయి: మండల వ్యవసాయాధికారిగా జీ సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ ఏఓగా పనిచేసిన వీ రవికుమార్ బదిలీపై జగ్గయ్యపేట వెళ్లారు. ఆయన స్థానంలో పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న సత్యనారాయణ ఏఓగా వత్సవాయి వచ్చారు. రైతులకు వ్యవసాయ సూచనలు, సలహాల కోసం తనవంతు కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు.

పంచాయతీ రాజ్ ఇన్‌చార్జ్ డీఈగా శ్రీనివాసరావు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పంచాయతీ రాజ్ జగ్గయ్యపేట సబ్ డివిజన్ డీఈగా జగ్గయ్యపేట జేఈగా పని చేస్తున్న కే శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు డీఈగా పని చేసిన ఏ శ్రీనివాసరావు గత నెల ఉద్యోగ విరమణ చేయడంతో కే శ్రీనివాసరావుకు జిల్లా అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు.

తుల్జా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న తుల్జా భవానీ అమ్మవారికి ఆలయ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవ్యాంత వాస్తు పూజ, బలిహరణం, త్రిపుర భైరవి, చిన్నస్త దేవి హోమం, మాతంగి కమలా దేవి హోమాలను హైదరాబాద్‌కు చెందిన అర్చకులు ఉండి విశ్వతేజ చైతన్య శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బాణావత్ బాలమ్మ, సంతు సేవాలాల్ మహారాజ్ ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీధనశైల సీతారామస్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠా మహోత్సవాలు జరిగి 16 రోజులు అయిన సందర్భంగా మంగళవారం సాయంత్రం రామాలయం కమిటీ ఆధ్వర్యంలో సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. శ్రీదుర్గామల్లేశ్వర అభయాంజనేయస్వామివారి ఆలయం భజన బృందంచే 41 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

100 మందికి కంటి పరీక్షలు



వీరులపాడు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చలమాల దుర్గారావు పేర్కొన్నారు. విజయవాడకు చెందిన పిన్నమనేని సిద్దార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆధ్వర్యంలో మండలంలోని చట్టన్నవరం గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు సాహితి, నమ్రతలు మాట్లాడుతూ మానవ శరీరంలో కళ్లు ఎంతో ప్రధానమైనవని వాటికి సంబంధించి ఇబ్బందులు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. 100 మందిని పరీక్షించగా 20 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. అలాగే ఉచితంగా మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం అమలు

జగ్గయ్యపేట అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తాతయ్య మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంతమంది ఉంటే అంత మంది విద్యార్థులకు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి వందనం అమలు చేస్తున్నామని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం పేర్కొన్నారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న మక్కపేట బస్‌షెల్టర్

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయితో పాటు మక్కపేట గ్రామంలో నిర్మించిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. వత్సవాయి గ్రామం లోపల నుంచి ప్రధాన రహదారికి అరకిలో మీటర్ దూరం ఉంది. దీంతో వత్సవాయి నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సు ఎక్కాలంటే ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామస్తులు విజ్ఞాపనల మేరకు గ్రామంలోని గాంధీపార్కు సెంటర్‌లో బస్‌స్టాండ్‌ను నిర్మాణం చేశారు. నిర్మాణం పూర్తయిన తర్వాత కొంతకాలం పాటు బస్సులు గ్రామంలో నిర్మించిన బస్‌స్టాండ్ వరకు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లేవారు. అయితే రానురానూ బస్‌స్టాండ్ వరకు బస్సులు రాకపోవడంతో అది కాస్తా నిరుపయోగంగా మారి సంచార జాతులవారికి అడ్డాగా తయారు అయింది. దీంతో ప్రయాణికులు బస్సులు ఎక్కాలంటే అర కిలో మీటరు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మక్కపేటలో...

మక్కపేట గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మాజీ ఎంపీలు పర్వతనేని ఉపేంద్ర, గద్దే రామ్మోహన్ నిధుల నుంచి గ్రామ నడిబొడ్డున ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను నిర్మించారు. అలాగే ప్రయాణికులకు, గ్రామస్తులకు విజ్ఞానాన్ని అందించేందుకు పై భాగంలో గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేసేలా దీని నిర్మాణం చేశారు. కాగా గ్రంథాలయం మాత్రం కార్యరూపం దాల్చలేదు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆలనాపాలనా కరువై నేడు సంచార జాతుల వారికి నిలయంగా మారింది. రెండు అంతస్తులుగా భారీ స్థాయిలో గ్రామ నడిబోడ్డున నిర్మించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణం చేసిన బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. రాత్రి ఏడు గంటలు దాటిన నుంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్‌షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వత్సవాయి గాంధీ పార్కు సెంటర్‌లో ..

న్యాయవాదులపై దాడులు హేయం



జగ్గయ్యపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నందిగామ రూరల్: రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులు హేయమైనవని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కన్నెకంటి జీవరత్నం పేర్కొన్నారు. విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు జెట్టి ప్రణీత్ కుమార్‌పై జరిగిన దాడికి నిరసనగా నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులపై వరుసగా దాడులు జరుగుతున్నా ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రణీత్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు నండ్రు శ్రీరామ్మూర్తి, పెనుగొండ రామచంద్రారెడ్డి, డేవిడ్‌రాజు, స్టాలిన్ బాబు, ఆజాద్, రామారావు, పాల్ ప్రసాద్, యరగొర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేట అర్బన్: బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది జెట్టి ప్రణీత్ కుమార్‌పై దుండగులు దాడి చేయడాన్ని ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం అమలుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు ఈవీ జగన్నాథరావు, వై.ధనుంజయుడు, రాయపూడి శ్రీనివాసరావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, ఎం.కృష్ణయ్య, జి.శ్రీనివాసగౌడ్, దాసరి నాగేశ్వరరావు, గంటా కృష్ణంరాజు, ఎం.అంజనేయులు, అంకమరాజు, పూల నాగరాజు, ఆలేటి కిషోర్, బిక్షమయ్య, దేశింగ్‌రాజు, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యామిత్ర కిట్ల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ముక్త్యాల రోడ్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(సెంట్రల్ స్కూల్)లో మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. 21వ వార్డు కౌన్సిలర్ గెల్లా సంధ్యారాణి, నాయకులు వైకుంఠేశ్వరరావు అతిథులుగా పాల్గొని పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయశ్రీ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు జాఫర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కొత్తగా హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన విజయశ్రీని అతిథులు అభినందించి సన్మానించారు.

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం విద్యాకిట్లను విద్యా కమిటీ చైర్మన్ నరేష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్ బాబు, ఉపాధ్యాయులు సుబ్బారావు, దేవదానం, పద్మావతమ్మ, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

బూదవాడ సచివాలయం తనిఖీ



బూదవాడ(జగ్గయ్యపేట): సచివాలయ సిబ్బంది అలసత్వం వీడాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. గ్రామంలోని సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఫిర్యాదులు రాకుండా చూడాలని అలసత్వం వీడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ సర్వేలను కూడా సిబ్బంది పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి కూడా గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించడం లేదు

ఎంపీపీ షేక్ మలక్‌బషీర్



కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అధికారులు సమయపాలన పాటించడం లేదని.. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైఎస్ ఎంపీపీలకు కనీస గౌరవం కూడా ఇవ్వడంలేదని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధికారుల తీరుపై మండిపడ్డారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మలక్‌బషీర్ మాట్లాడుతూ ఎంపీడీఓ కాని, పీఆర్ ఏఈఈ కాని మండల పరిషత్, జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేస్తే ఆ నిధులకు కనీసం ఎస్టిమేట్ వేయకుండా తాత్సారం చేస్తున్నామని మండిపడ్డారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు, యూనిఫాం పేరుతో ఎక్కువ ఫీజు వసూలు చేస్తున్నారని ఇటువంటి వాటిపై ఎంఈఓ బాలాజీనాయక్ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్‌కిరణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో కూటమి ప్రభుత్వం తొలగించిన 22మంది వీఓలను విధుల్లోకి తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసినా ఎందుకు తిరిగి తీసుకోలేదని ఏపీఎం శ్రీనివాసరావును జెడ్పీటీసీ సభ్యుడు వేల్పుల ప్రశాంతి, వైఎస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు నిలదీశారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, డెప్యూటీ ఎంపీడీవో ఇందుపల్లి నానిబాబు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గండేపల్లి సీఎస్ఐ చర్చి ప్రతిష్టా మహోత్సవం

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి సీఎస్ఐ చర్చిలో ఆరవ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగిందని పాస్టర్ రెవరెండ్ కొండా స్టాలిన్ తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నందిగామ డీనరీ డయోసిస్ రెవరెండ్ చంద్రకుమార్ పాల్గొని మాట్లాడుతూ చర్చి ఆరో ప్రతిష్ఠా కార్యక్రమం సంఘస్థులు జరుపుకోవడం అభినందనీయమన్నారు. ముందుగా సండే స్కూల్ విద్యార్థులు క్రీస్తు సన్నుతి గీతాలు ఆలపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వెయ్యి మందికి ప్రేమ విందు(అన్నసమారాధన) చేశారు. కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవికుమార్, ఆలయ మండప నిర్మాణ కమిటీ సభ్యులు మార్కపూడి మధుబాబు, బొక్కా రమేష్, శ్రీరాం మల్లికార్జునరావు, బొక్కా శ్రీకాంత్, కీసర వెంకట్, మీసాల జయకిరణ్, బొక్కా రవికుమార్, బొక్కా రత్నం, బొక్కా మోహన్, మార్కపూడి లాజరు, బొక్కా ప్రభాకరరావు, మందా అనంతమ్మ, స్త్రీల మైత్రీ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం



తోటరావులపాడు ఎంపీపీ పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో విద్యార్థులు, యోగా గురువు

చందర్లపాడు(నందిగామ రూరల్): శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో యోగా సాధన కీలక పాత్ర పోషిస్తుందని యోగా గురువు గాడిపర్తి సీతారామారావు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చందర్లపాడు మండలం తోటరావులపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగా సాధనపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. హెచ్‌ఎం కొల్లి నరసింహారావు, ఉపాధ్యాయులు సురేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నందిగామ పట్టణంలోని చైతన్య కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం యోగా గురువు సీతారామారావు ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ అమరనేని కార్తీక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయమూర్తిని సత్కరించిన వృద్ధాశ్రమ నిర్వాహకులు

నందిగామ రూరల్: నిరాదరణకు గురైన వృద్ధులను కాశీం అండ్ ఖాశీం వృద్ధాశ్రమ నిర్వాహకులు అక్కున చేర్చుకుని కంటికి రెప్పలా చూసుకోవడం అభినందనీయని సీనియర్ సివిల్ జడ్జి సత్యలక్ష్మి ప్రసన్న పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మాగల్లు గ్రామంలో గల కాశీం అండ్ ఖాశీం వృద్ధాశ్రమంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలోని వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. ముఖ్యంగా వృద్ధులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా సీనియర్ సిటిజన్ యాక్ట్ -2007 ప్రకారం మండల న్యాయ సేవాధికార సంస్థకు అర్జీ పెట్టుకుంటే సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. వృద్ధాశ్రమ పరిసరాలను పరిశీలించి నిర్వాహకుడు షేక్ కరిముల్లాను అభినందించారు. అనంతరం న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణిబాబు, షేక్ ఆజాద్, కొమ్మినేని మాలేశ్వరరావు, యరగొర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏక పంట విధానానికి స్వస్తి పలకాలి



లింగాల(వత్సవాయి): రైతులు ఏకపంట విధానానికి స్వస్తి పలకాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచించారు. మంగళవారం లింగాలలో జరిగిన ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవనశాఖాధికారి బాలాజీకుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ భవానిలు మాట్లాడుతూ రైతులు మూస పద్ధతులకు స్వస్తి చెప్పి ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలన్నారు. ఆయిల్‌ఫామ్ వల్ల అంతర పంటలు వేసుకునేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ మొక్కలను ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు అందించడం జరుగుతుందని బాలాజీకుమార్ తెలిపారు. విదేశాల నుంచి ఈ మొక్కలను తెప్పించి ఏడాదిపాటు నర్సరీల్లో పెంచిన తర్వాతనే రైతులకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఆయిల్‌ఫామ్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారి వర్ధినీకుమారి, ఏఓ సత్యనారాయణ, రైతు సంఘ నాయకులు వడ్లమూడి రాంబాబు, తొండపు జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

కూటమి పాలనంతా మోసమే

వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ



పెనుగంచిప్రోలులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గాంధీ, పక్కన రామారావు తదితరులు

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో కూటమి పాలన అంతా మోసాలతోనే సాగుతోందని వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రం పెనుగంచిప్రోలులో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి వైఎస్సార్ సీపీ శ్రేణులే లక్ష్యంగా విధ్వంసాలకు తెరతీశారన్నారు. మహిళలు, బాలికలపై రాష్ట్రంలో రోజురోజుకు దాడులు, అత్యాచారాలు పెరిగి పోతున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని పేర్కొన్నారు. చంద్రబాబు మోసపూరిత పాలనపై ప్రజలను చైతన్య పరిచేలా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు గుడిమెట్ల శంకర్, ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి గడాటి పెద్దోడు, నియోజకవర్గ ఎస్సీ సెల్, వాణిజ్య విభాగం, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు కీసర లోకేశ్వరరావు, దేరంగుల శ్రీనివాసరావు, మెండెం రామారావు, సీనియర్ రైతు నాయకుడు చుంచు బెనర్జీ, మండల ఉపాధ్యక్షుడు జక్కులూరి దేవదాసు, పట్టణ యూత్ అధ్యక్షుడు మల్లెబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శి బొజ్జా సాయి, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నలబోతు వెంకటేష్ పాల్గొన్నారు.

కూటమి పాలన అట్టర్ ఫ్లాప్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అట్టర్ ఫ్లాప్ అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు పేర్కొన్నారు. యూత్ రాష్ట్ర కార్యదర్శి శివరాత్రి పృథ్వీ నివాసంలో మంగళవారం జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొడుతూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని విమర్శించారు. బాబు మోసపూరిత పాలన గురించి ప్రజలకు చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. ఎస్సీలపై దాడులు చేస్తున్నా హోం మంత్రికి కనిపించడం లేదని మండిపడ్డారు. వైఎస్ జగన్ పథకాలు ఆపేశామన్న భయం చంద్రబాబులో కనిపిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చిల్లకల్లు, గౌరవరం, తిరుమలగిరి కన్వీనర్లు దొంగల సింహాద్రి, ఆదోని కిషోర్, కరిశ ఇజ్రాయిల్, సొసైటీ మాజీ చైర్మన్ అన్నాబత్తుల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మండవ శ్రీనివాస్ గౌడ్, దొంగల రాంబాబు, బజారు సాయి, పానుగంటి బ్రహ్మనాయుడు, పాతకోటి ఉదయభాను, బైరవబోయిన భాను, మందడపు జగదీష్, బండి రాజు, బుల్లెయ్య తదితరులు పాల్గొన్నారు.



చిల్లకల్లులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎంపీటీసీలకు అధికారులు సమాచారం ఇవ్వడం లేదు



బదిలీపై వెళ్తున్న అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ గాంధీ, పక్కన ఎంపీడీఓ శ్రీను, అధికారులు

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపీటీసీ సభ్యులకు అధికారులు కనీస సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ మార్కపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు ఎంపీటీసీ సభ్యులు కీసర లోకేశ్వరరావు, వెల్ది ప్రభాకర్, గుంటుపల్లి వాసు తదితరులు మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పుస్తకాల పంపిణీ తదితర కార్యక్రమాలకు ఎంపీటీసీలకు కనీస సమాచారం లేదన్నారు. దీనిపై ఎంఈఓ డీ రవీంద్ర మాట్లాడుతూ ఇకనుంచి అలా జరగకుండా చూస్తామన్నారు. ఎంపీపీ గాంధీ మాట్లాడుతూ మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 35 లక్షలు రావాల్సి ఉందని, కానీ ప్రభుత్వం నిధులు వేరే వాటికి మళ్లించడం జరిగిందన్నారు. మండల పరిషత్‌లో ఒక్క రూపాయి కూడా లేదన్నారు. సమావేశాలకు రెవిన్యూ అధికారులు ఎవరూ రావడం లేదని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అలాగే మునేరు తువ్వకాలువ గండ్లు వెంటనే పూడ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. పంచాయతీ రాజ్ ఏఈ సుందరరామయ్య మాట్లాడుతూ వెంగనాయకునిపాలెం గ్రామంలో పంచాయతీ కార్యాలయ మరమ్మతులకు రూ. 20 లక్షలు, తోటచర్ల - శనగపాడు మధ్యలో వాగుపై కల్వర్టు మరమ్మతులకు రూ.50 లక్షలు, కొణకంచిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.40 లక్షలు, గుమ్మడిదుర్రు నుంచి తాగునీటి పథకం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షలకు అనుమతులు వచ్చాయన్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ కిషోర్ మాట్లాడుతూ మండలంలో ఐదు రోడ్లకు సంబంధించి మరమ్మతులకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపడం జరిగిందని తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్తున్న కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ భానుప్రసాద్, ఏఈ గోపిలను సత్కరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పీ అనిల్, ఎంపీడీఓ జీ శ్రీను, ఏఓ సిద్ధారెడ్డి, ఎన్ఎస్‌పీ జేఈ గోపి, ఏపీఓ జనార్దన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం ఏర్పాట్ల పరిశీలన



పేటలోని మార్కెట్ యార్డులో యోగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణారావు

జగ్గయ్యపేట అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21వ తేదీన జగ్గయ్యపేట పురపాలక సంఘం ఆధ్వర్యాన స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించే యోగా దినోత్సవం ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా యోగా దినోత్సవం వేడుకలకు ముఖ్య అతిథులుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయం సిబ్బంది, మున్సిపల్ అధికారులు, పట్టణంలోని వివిధ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆలయ భూముల కౌలు వేలం ద్వారా రూ.1.62 లక్షల ఆదాయం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయ భూముల కౌలు వేలం ద్వారా ఆలయానికి రూ.1.62 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. ఆలయ బేడా మండపంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలంలో సర్వే నెంబర్ 50, 51లో ఆరు ఎకరాలకు మొదటి బిట్ గింజుపల్లి వెంకటరమణ ఏడాదికి రూ. 54,000, రెండవ బిట్ మందడపు చంద్రరావు రూ. 54,000, మూడవ బిట్ కందిమళ్ల పుల్లారావు రూ. 54,000లకు కౌలు హక్కు పొందారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రమ, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.